క్లుప్తంగా

12న అన్నమయ్యకు నృత్యనీరాజనం

విజయవాడ కల్చరల్: సంగీత కళాశాల్లోని కళా వేదికపై తాళ్లపాక అన్నచార్యుల జయంతి సందర్భంగా ఈ నెల 12న నృత్య నీరాజనం కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు సీఈఓ ఆర్.మల్లికార్జునరావు శుక్రవారం తెలిపారు. ఘంటసాల వెంకటేశ్వరరావు ప్రభుత్వ నృత్య సంగీత కళాశాల ఏపీ సృజనాత్మక సమితి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. నగరానికి చెందిన పలువురు నాట్యాచార్యులు తమ బృందాలతో అన్నమయ్య సంకీర్తనలకు నృత్యాలను అభినయిస్తునట్లు తెలిపారు.

కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన దుర్గగుడి ఈఓ



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): శ్రీ దుర్గామల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం నూతన కార్యనిర్వహణాధికారిగా(ఈఓ) బాధ్యతలు స్వీకరించిన వి.కె శీనానాయక్ శుక్రవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ లక్ష్మీశాను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన చాంబర్‌లో కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేశారు.

నగరంలో ట్రాఫిక్ సమస్యలపై సమీక్ష



పటమట(విజయవాడతూర్పు): నగరంలో ట్రాఫిక్ సమస్యను అధిగమించడానికి చర్యలు తీసుకోవాలని వీఎంసీ, పోలీస్ అధికారులను వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశించారు. శుక్రవారం వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని ఆయన చాంబర్లో ఆయా విభాగాల అధికారులతో ట్రాఫిక్ సమస్యపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సమస్యలు, రహదారి కిక్కిరిసిన ప్రాంతాలు, అవరోధాలపై చర్చించారు. నగరంలో ట్రాఫిక్ నిర్వహణను మెరుగుపర్చేందుకు చర్యలు తీసుకోవాలని కమిషనర్ ఆదేశించారు. సమావేశంలో డీసీపీ చంద్రబోస్, అదనపు డెప్యూటీ పోలీస్ కమిషనర్ (ఏడీసీపీ) ప్రసన్నకుమార్, ఏసీపీ మోహన్ బాబు, సీఐలు ఉమామహేశ్వరరావు, సత్య రమేష్, వీఎంసీ చీఫ్ సిటీప్లానర్ సంజయ్ రత్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

జై జవాన్.. జై హింద్





పాకిస్తాన్‌పై భారత్ చేస్తున్న ఆపరేషన్ సిందూర్‌కు మద్దతుగా నగరంలోని లయోల వాకర్స్, ఇతర సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం బెంజిసర్కిల్ వద్ద కొవ్వొత్తులతో ర్యాలీ చేసి సంఘీభావం తెలిపారు. ఆప్రాంతంలో జాతీయ పతాకాలు పట్టుకుని ర్యాలీగా వెళ్తూ భారత్‌మాతాకీ జై, జై జవాన్, జై హింద్ అంటూ దేశభక్తిని చాటారు.

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

నగరంలో రాత్రి గస్తీ కట్టుదిట్టం

బస్టాండ్, రైల్వేస్టేషన్, లాడ్జీల్లో పోలీసుల తనిఖీ

విజయవాడస్పోర్ట్స్: ప్రజలకు భద్రత, భరోసా కల్పిస్తూ రాత్రి గస్తీని మరింత కట్టుదిట్టం చేస్తున్నట్లు డెప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్(డీసీపీ) కె.జి.వి.సరిత తెలిపారు. రాష్ట్ర హోం శాఖ ఆదేశాల మేరకు జిల్లాలోని ముఖ్య ప్రాంతాల్లో, వాహనాలు, లాడ్జీలను తనిఖీ చేస్తున్నట్లు చెప్పారు. గురువారం రాత్రి 12 గంటలకు పండిట్ నెహ్రూ బస్టాండ్‌లో డీసీపీ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది సోదాలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యుద్ధ వాతావరణం నేపథ్యంలో ప్రజలకు ధైర్యం కల్పించేందుకు, రక్షణను మరింత పెంచేందుకు ఈ తనిఖీలు చేస్తున్నామన్నారు. అనుమానిత వ్యక్తులు, అక్రమ రవాణాపై పటిష్టమైన నిఘా పెట్టినట్లు తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలు, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టడి చేస్తూ ప్రజలకు పోలీసులు అందుబాటులో ఉంటారని తెలిపారు. ప్రత్యేకంగా పోలీసు బృందాలను, పోలీసు వాహనాలను ఏర్పాటు చేసి ముమ్మరంగా వాహనాలు, లాడ్జీలు, హోటళ్లు, నిర్జన ప్రదేశాల్లో తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. రాత్రి సమయంలో తిరిగే ప్రతి ఒక్కరినీ ఆపి క్షుణ్ణంగా విచారించి అనుమానిత వ్యక్తులను ఐరీస్ వాహనం ద్వారా తనిఖీ చేస్తామని పేర్కొన్నారు.



గవర్నర్‌పేటలోని ఓ లాడ్జిలో తనిఖీ చేస్తున్న పోలీసులు

నల్లరిబ్బన్లు ధరించి సీహెచ్‌ఓల ఆందోళన

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): తమ సమస్యల పరిష్కారం కోసం కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ (సీహెచ్‌ఓ) వినూత్న నిరసన తెలిపారు. నల్లదుస్తులు, నోటికి రిబ్బను ధరించి నిరసన ప్రదర్శన చేపట్టారు. గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో సీహెచ్‌ఓలు చేపట్టిన ఆందోళన శుక్రవారంతో రెండో రోజుకు చేరుకుంది. నేషనల్ హెల్త్ మిషనల్‌లో భాగంగా విలేజ్ హెల్త్ క్లీనిక్‌లలో ప్రభుత్వం సీహెచ్‌ఓలను నియమించింది. వీరంతా గ్రామీణ ప్రాంతాల్లో పేదలకు వైద్య సేవలు అందిస్తున్నారు. ఆరేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న వీరిని ఎన్‌హెచ్‌ఎం నిబంధనల మేరకు క్రమబద్ధీకరించాలని, జాబ్ చార్ట్ అమలు, ఎన్‌హెచ్‌ఎం సిబ్బందితో సమానంగా వేతనాలు ఇవ్వాలని, హెచ్‌ఆర్ పాలసీ ప్రకటించాలని, ట్రాన్స్‌ఫర్, వేతన సవరణ, ఈపీఎఫ్‌ఓను పునరుద్ధరించాలి తదితర ప్రధాన డిమాండ్లతో ఆందోళన చేపట్టారు. అంతకు ముందు 10 రోజుల పాటు ధర్నా చౌక్‌లో ఆందోళన చేపట్టినప్పటికీ ప్రభుత్వం నుంచి స్పందన లేదని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ ప్రతినిధులు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రోత్సాహక పారితోషకంలో కోత విధించకుండా సకాలంలో చెల్లించాలని డిమాండ్ చేశారు. బకాయిలు సత్వరమే చెల్లించాలని, హెల్త్ క్లీనిక్‌ల అద్దెలు క్రమం తప్పకుండా చెల్లించాలని కోరారు. ఎన్టీఆర్ జిల్లాకు చెందిన సీహెచ్‌ఓలు వర్షిణి, నవీన్, సీహెచ్‌ఓలు పాల్గొన్నారు.



నోటికి నల్ల రిబ్బన్లు ధరించి నిరసన చేపట్టిన కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు

నేడు ఉచిత మెగా వైద్య శిబిరం

మధురానగర్(విజయవాడసెంట్రల్): మధురానగర్ నేతాజీ కాలనీ గంగోత్రి వాటర్ ప్లాంట్‌లో శనివారం మల్లాది విష్ణు యూత్, ఎస్‌కే బాబు ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు షేక్ చాంద్ బాషా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రముఖ వైద్యులు ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఉచిత మెగా వైద్య శిబిరంలో కళ్లు, బీపీ, షుగరు, పళ్లు, గుండె, క్యాన్సర్, ఎముక సంబంధిత వ్యాధుల నిపుణులు వైద్య పరీక్షలు చేస్తారని తెలిపారు. మధురానగర్, పసుపుతోట, నేతాజీ కాలనీ తదితర ప్రాంత వాసులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

వీఎంసీ ఉద్యోగి కుటుంబానికి నష్ట పరిహారం



పటమట(విజయవాడతూర్పు): వీఎంసీ ప్రధాన కార్యాలయంలో 2023 జూలైలో ప్రమాదవశాత్తూ సివేజ్ లైన్‌లో పడి మరణించిన వీఎంసీ ఉద్యోగి మాణిక్యాలరావు కుటుంబ సభ్యులకు నష్టపరిహారంగా రూ.20 లక్షలను వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర అందించారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని ఆయన చాంబర్లో కలిసిన బాధిత కుటుంబీలకు కమిషనర్ చెక్‌ను శుక్రవారం అందించారు. కమిషనర్ మాట్లాడుతూ ఉద్యోగుల బాగోగులు చూసుకోవటంలో వీఎంసీ ముందుంటుందన్నారు. అనంతరం మృతుడి భార్య మేడ యశోదకు చెక్‌ను అందించారు. అకౌంట్స్ ఆఫీసర్ సత్యనారాయణమూర్తి, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సామ్రాజ్యం పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): సింగ్‌నగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో వార్షిక తనిఖీలు, మరమ్మతుల నేపథ్యంలో స్థానిక 58వ డివిజన్ సింగ్‌నగర్ పరిసర ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఈఈ పి.రవీంద్రబాబు, సింగ్‌నగర్ ఏఈ డి.కిరణ్‌కుమార్ శుక్రవారం తెలిపారు. 11 కేవీ భరత మాత మందిర్ ఫీడర్ మరమ్మతుల నిమిత్తం తోట వారి వీధి, భరత మాత కాలనీ, భరత మాత మందిరం రోడ్, ఉప్పలపాటి సీతారామరాజు రోడ్డు, ఆర్అండ్‌బీ కాలనీ పరిసర ప్రాంతాల్లో శనివారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు పేర్కొన్నారు. ఆయా ప్రాంతాల్లోని వినియోగదారులు విద్యుత్‌శాఖ వారికి సహకరించాలని ఆయన కోరారు.

పరిసరాల శుభ్రత పాటించాలి

మధురానగర్(విజయవాడసెంట్రల్): ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని దుర్గాపురం పట్టణ ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి డాక్టర్ సృజన పేర్కొన్నారు. స్థానిక దుర్గాపురంలో శుక్రవారం డ్రైడేపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వారంలో ఒక రోజు తప్పనిసరిగా డ్రైడేగా పాటించి ఇంట్లోని నీటి నిల్వలను మార్చుకోవాలని సూచించారు. దోమల వల్ల మలేరియా, డెంగీ, చికున్‌గున్యా, ఫైలేరియా తితర వ్యాధులు ప్రబలుతాయన్నారు. అనంతరం మలేరియా విభాగం సిబ్బంది దోమల లార్వాను పరిశీలించారు. కార్యక్రమంలో ఆరోగ్యకేంద్రం, మలేరియా విభాగం సిబ్బంది పాల్గొన్నారు.



డ్రైడేపై అవగాహన ర్యాలీ

ఇంటి బయట పెట్టిన బైకు చోరీ

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): స్నేహితుడి కుమారుడి పుట్టిన రోజు అని కేకు కట్‌చేసి శుభాకాంక్షలు చెబుతామని వెళ్లిన ఓ వ్యక్తి బైకు చోరీకి గురైన సంఘటన అజిత్‌సింగ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం రాత్రి జరిగింది. పోలీసుల కథనం మేరకు పశ్చిమగోదావరి జిల్లా పెద్దపాడు మండలానికి చెందిన సిద్దాబత్తిన సోమసుందర శేఖర్‌బాబు ఏలూరు, విజయవాడలో ఉన్న ఆయుష్ హాస్పిటల్స్‌లో ప్లంబర్‌గా పనిచేస్తూ ఉంటాడు. ఈ నెల 8వ తేదీన తన స్నేహితుడు కుమారుడిది పుట్టినరోజు కావడంతో సింగ్‌నగర్ లూనా సెంటర్‌లోని తన స్నేహితుడి ఇంటికి తన హీరో హెచ్‌ఎఫ్ డీలక్స్ బండిపై వచ్చాడు. వారి ఇంటి ముందు బైకు పెట్టి లోపలకి వెళ్లి పుట్టినరోజు కేకును కట్ చేయించి, గంట తరువాత బయటకు వచ్చి చూశాడు. తన బైకు మాయమైంది. ఆ చుట్టుపక్కల ప్రాంతాల్లో గాలించినా ఎక్కడా బైకు ఆచూకీ లభించలేదు. దీంతో పోలీసులను ఆశ్రయించాడు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

మధురం.. వాగ్గేయకార సంకీర్తనం

విజయవాడ కల్చరల్: సద్గురు త్యాగరాజ స్వామి జయంతి సందర్భంగా శ్రీ సుబ్రహ్మమణ్య మహతి సంగీత సమితి ఆధ్వర్యంలో దుర్గాపురంలోని సంస్థ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన వాగ్గేయకార సంకీర్తనం మధురంగా సాగింది. నగరానికి చెందిన సంగీత విద్వాంసులు, యువ సంగీత కళాకారులు, బాల సంగీత విద్యార్థులు త్యాగరాజ స్వామి రచించిన సంకీర్తనలను మధురంగా గానం చేశారు. సంస్థ కార్యదర్శి సీవీరావ్, చిట్టారామలక్ష్మి కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. మోదుమూడి సుధాకర్, అంజనా సుధాకర్, చిట్టా కార్తీక్, మల్లాది కార్తీక త్రివేణి, గండూరి శ్రీనివాసమూర్తి, సుబ్రహ్మమణ్య మహతీ సంగీత సమితి విద్యార్థినులు పాల్గొన్నారు.



త్యాగరాజ స్వామి కృతులను గానం చేస్తున్న మోదుమూడి సుధాకర్

మురళీ నాయక్ త్యాగం మరువలేనిది

విజయవాడ కల్చరల్: దేశ రక్షణలో ప్రాణాలను తృణప్రాయంగా త్యాగం చేసిన వీర సైనికుడు మురళీ నాయక్ త్యాగం మరువలేనిదని సాంస్కృతిక కళా వేదిక సభ్యులు పేర్కొన్నారు. గాంధీనగర్‌లోని సంస్థ కార్యాలయంలో శుక్రవారం సంతాప సభను నిర్వహించారు. సంఘ ప్రతనిధి పరుచూరి విజయలక్ష్మి మాట్లాడుతూ క్లిష్ట పరిస్థితుల్లో ప్రభుత్వానకి అండగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో వివిధ సంస్థల ప్రతినిధులు చింతకాయల చిట్టిబాబు, డేవిడ్ రాజు. శ్యాంప్రసాద్, బోడి ఆంజనేయరాజు, ప్రసూనా రామన్, నరసింహారావు, చంద్రశేఖర్ పాల్గొన్నారు.